సాక్షి
ప్రకాశం

గురువారం । 13 । జూన్ । 2024



యమపాశాలు

ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా విద్యుత్ తీగలు యమపాశాలుగా మారతాయి. వర్షాకాలంలో విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు, జంతువుల ప్రాణాలు హరిస్తున్నాయి.

- 8లో..



పంటకాల్వలోకి దూసుకెళ్లిన బైక్

పంటకాల్వలోకి బైక్ దూసుకెళ్లడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మార్కాపురంలో మంగళవారం రాత్రి జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35.6/28.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: ఈ నెల14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ తెలిపారు. బుధవారం రెడ్ క్రాస్ ప్రతినిధులు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవంపై కలెక్టర్ పలు సూచనలు చేశారని తెలిపారు. ప్రతి ఏడాది చేస్తున్నట్లే ఈ ఏడాది కూడా ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో రక్తదాతలను సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ రక్తదానం చేయనున్నారని, ముఖ్య అతిథిగా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హాజరవుతారని తెలిపారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డా.వెంకటేశ్వర రెడ్డి కూడా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

విద్యా ప్రవేశ్‌ను పాఠశాలల్లో అమలు చేయాలి

ఒంగోలు: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల్లోని ఒకటో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులంతా విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 90 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి రోజు 2 గంటలపాటు 3 రకాల కృత్యాలను పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. శారీరక అభివృద్ధి, జ్ఞానాత్మక అభివృద్ధి, భాషాభివృద్ధి ఉప అంశాలుగా కృత్యాలు నిర్వహించాలని, ప్రతిరోజు నిర్వహించే కృత్యాలను ఆయా ఉపాధ్యాయులు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ మధ్య బేస్‌లైన్ టెస్టు నిర్వహించాల్సి ఉంటుందని, తద్వారా వచ్చిన ఫలితాలను 90 రోజుల తరువాత నిర్వహించే ఎండ్‌లైన్ టెస్టుతో సరిపోల్చుతారన్నారు. పర్యవేక్షణాధికారులు తప్పనిసరిగా 5 విజిట్లు చేసి, వివరాలను జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పంపాలని సూచించారు. ఒకటో తరగతి పాఠ్యాంశాలకు అనుబంధంగా కృత్యాల అమరిక ఉందని, కృత్యాల నిర్వహణ తెలియజేసే ఫొటోలు, వీడియోలను మండల విద్యాశాఖ అధికారికి వాట్సాప్ గ్రూపులకు, జిల్లా వాట్సాప్ గ్రూపునకు పంపాలని డీఈవో డి.సుభద్ర ఆదేశించారు.

సెలవులకు బైబై

వేసవి సెలవులు ముగిసిపోయాయి. బడి తలుపులు తెరుచుకుంటున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. తమ పిల్లల్ని స్కూళ్లకు పంపేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. విద్యార్థులు సెలవులకు బైబై చెబుతూ కొత్త పుస్తకాల బ్యాగులతో బడిబాట పట్టనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

బడికి పోదాం పద..

- మోగనున్న బడిగంటలు
- సిద్ధమవుతున్న చిన్నారులు
- జిల్లాకు చేరిన 1.93 లక్షల స్టూడెంట్ కిట్లు
- తొలి రోజు నుంచే మధ్యాహ్న భోజనం ప్రారంభం
- ప్రైవేటు పాఠశాలల్లోనూ సర్కార్ పుస్తకాలు తప్పని సరి
- ప్రైవేటు విద్యా సంస్థల బస్సులపై దృష్టి సారించనున్న రవాణాశాఖ
- ఆర్టీసీలో బస్‌పాసుల జారీపై సందిగ్ధత



బండ్లమిట్ట హైస్కూల్ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఒంగోలు:

జిల్లాలో 2,930 స్కూళ్లు ఉన్నాయి. అందులో ప్రభుత్వానికి సంబంధించి 2128 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 302 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 550 ప్రైవేటు విద్యాసంస్థలు నడుస్తున్నాయి. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దృష్ట్యా ఇప్పటికే పాఠశాలల్లో అవసరమైన మార్పులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టారు. చిన్న చిన్న మరమ్మతులు పూర్తిచేసుకుని పాఠశాలలను సంసిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1.96 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే వీరందరికీ విద్యార్థి కిట్టు (జగనన్న విద్యాకానుక కిట్టుకు మారిన పేరు) అందించాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతానికి పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన వస్తువులు కూడా ఈనెల 18వ తేదీకి మండల కేంద్రాలకు చేరే అవకాశం కనిపిస్తోంది. మొత్తంగా 1,93,440 మందికి విద్యార్థి కిట్లను గురువారం నుంచి విద్యార్థులకు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

గత ఏడాది మిగిలిన స్టాకు పంపిణీకి నో

ఇదిలా ఉంటే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిపోయిన స్టాకును పంపిణీ చేయవద్దని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. బ్యాగులు కావొచ్చు లేదా ఇతరత్రా కానుక కిట్లు కావొచ్చు. వాటన్నింటినీ సంబంధిత స్టాకు పాయింట్లలోనే నిల్వ చేసి ఉంచాలని ఆదేశించారు. మరో వైపు తాజాగా వస్తున్న స్టాకుతో కిట్లను భద్రపరచడం విద్యాశాఖ వర్గాలకు సవాల్‌గా మారనుంది. అయితే కిట్టులో ఏదైనా వస్తువు బాగోలేకపోతే దానిని పంపిణీ చేయవద్దని ఆదేశించారు. వాటి నాణ్యతను పరిశీలించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపైనే ఉంచారు. అంతే కాకుండా పాఠశాలల ప్రారంభం సందర్భంగా కిట్ల పంపిణీతోపాటు తల్లిదండ్రులతో కూడా సమావేశం నిర్వహించాలని డీఈవో ఇప్పటికే ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను ప్రాథమిక స్థాయి నుంచే పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు

నేటి నుంచే మధ్యాహ్న భోజన పథకం:

జగనన్న గోరు ముద్ద పథకాన్ని తాజాగా పీఎం పోషణ్ (గోరుముద్ద)గా మార్చారు. విద్యార్థులకు తొలిరోజు నుంచే మధ్యాహ్న భోజనాన్ని, రాగి జావ, చిక్కీలను అందించేందుకు అవసరమైన వస్తువులన్నీ పాఠశాలలకు పంపించాలని ఆదేశాలు అందాయి. ఉదయం 10 గంటల లోపల ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు రాగిజావ అందించాలని, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇంటర్వెల్ సమయంలో జావ అందించాలని నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఇంకా విద్యాశాఖ క్యాలెండర్ విడుదల కాకపోవడంతో పాత సమయాలే కొనసాగిస్తారా లేక ఇంకేమైనా మార్పులు ఉంటాయా అనేది తేలాల్సి ఉంది.



స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి పాఠ్యపుస్తకాలు అందిస్తున్న డీఈవో సుభద్ర



స్కూళ్లకు చేరిన పాఠ్యపుస్తకాలను దించుతున్న సిబ్బంది



ఒంగోలు బండ్లమిట్ట స్కూల్లో జరుగుతున్న మరమ్మతులు

ప్రైవేటు బస్సులపై నేటి నుంచే తనిఖీ..

ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను గురువారం నుంచే రవాణాశాఖ అధికారులు తనిఖీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1400 వరకు విద్యా సంస్థల బస్సులు ఉండగా ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందలేదు. దీంతో సర్టిఫికెట్లు పొందకుండా రోడ్డెక్కే బస్సులపై చర్యలు చేపట్టేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమయ్యారు. మరో వైపు ఈ బస్సులకు ఫిట్‌నెస్‌కు సంబంధించి హాజరైన బస్సులను వేగవంతంగా పరీక్షించి సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా చూసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.

విద్యార్థుల బస్సు పాసులపై కొనసాగుతున్న సందిగ్ధత:

పాఠశాలలు ప్రారంభం నాటి నుంచే విద్యార్థులకు ఆర్టీసీ బస్ పాసులను సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే బుధవారం నాటికి కూడా బస్సు పాసులకు సంబంధించిన ఉత్తర్వులు రాలేదని ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎప్పటి నుంచి బస్సు పాసులు జారీ అవుతాయనేది స్పష్టత రావాల్సి ఉంది. అంతే కాకుండా గతంలో ప్రైవేటు విద్యాసంస్థలకెళ్లి బస్ పాసులను ఆర్టీసీ అధికారులు జారీ చేసేవారు. అయితే ఈ ప్రక్రియ స్థానంలో విద్యార్థులే బస్టాండుకు వచ్చి బస్‌పాసులు పొందాలని సూచించనున్నట్లు సమాచారం.



సిద్ధంగా ఉన్న స్కూల్ బ్యాగ్, బెల్ట్‌లు



సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

నేటి నుంచి కిట్లు పంపిణీ

"విద్యార్థులకు వచ్చిన కిట్లను గురువారం నుంచే పంపిణీ చేస్తాం. అందులో భాగంగానే పాఠశాలలకు కిట్లు పంపేందుకు అవసరమైన చర్యను ఒంగోలు మండలం నుంచి ప్రారంభించాం. కిట్ సర్దేందుకు రూ.3, రవాణా ఛార్జీలు రూ.11 కూడా విడుదలయ్యాయి. వాటికి సంబంధించి కలెక్టర్ ద్వారా ఉత్తర్వులు పొంది మండల కేంద్రాలకు నిధులు జమచేస్తాం. రాగిజావ, బియ్యం, గుడ్లు, చిక్కీలు వంటివన్నీ కూడా పాఠశాలలకు చేరుతున్నాయి. మధ్యాహ్న భోజనాన్ని తొలిరోజు నుంచే విద్యార్థులకు అందించేందుకు ఆదేశాలు జారీ చేశాం. గత ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు వచ్చిన దృష్ట్యా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య మరింతగా పెరుగుతుందని ఆశిస్తున్నాం. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి. ఇందుకు సీఆర్‌పీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాఠశాలల హెడ్మాస్టర్లు బాధ్యత తీసుకుని ప్రతి ఒక్క చిన్నారి బడిలో చేరేలా చర్యలు చేపడుతున్నాం."

– డి.సుభద్ర, జిల్లా విద్యాశాఖ అధికారి

ఫీజుల నియంత్రణపై దృష్టిసారించాలంటున్న తల్లిదండ్రులు

ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణపై దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రతి ఏటా పాఠశాలల ప్రారంభ సమయంలోనే ఫీజులు ఇష్టారీతిన పెంచుతుండడంతో నియంత్రణ చేపట్టాలని కోరుతున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలలో నోటీసు బోర్డులో ఫీజులు ఎంతెంత వసూలు చేస్తున్నారనే విషయాన్ని ఉంచాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవనే హెచ్చరికలు జారీ అయ్యాయి

ప్రస్తుతం 1.96 లక్షలకు చేరిన విద్యార్థులు

జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ 24 వ తేదీ గణాంకాల ప్రకారం 1.93 లక్షల మందికి విద్యార్థి కిట్లను సిద్ధం చేశారు. అయితే ఒకటో తరగతిలో విద్యార్థులు నూతనంగా చేరుతుండడంతో విద్యార్థుల సంఖ్య 1.96 లక్షలకు చేరింది. దీని ప్రకారం మరో 2 నుంచి 3 వేలమందికి అదనంగా కిట్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. 1 నుంచి7 వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరగా, 8 నుంచి 10 వరకు పాఠ్యపుస్తకాలు మాత్రం నేరుగా ఉన్నత పాఠశాలలకు చేరుస్తున్నారు. అయితే మొత్తం కిట్టు ఒకేసారి అందించేందుకు అవసరమైన సామగ్రి రానప్పటికీ వచ్చిన వస్తువులతో కిట్టును మాత్రం గురువారం అందించేందుకు చర్యలు ముమ్మరం అయ్యాయి. అందులో భాగంగానే బుధవారం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థి కిట్టుకు ఇప్పటి వరకు వచ్చిన నాలుగు రకాల వస్తువులను ఒంగోలు మండల పరిధిలోని ఉపాధ్యాయులకు అందించారు. ఉపాధ్యాయులు వాటిని పాఠశాలలకు తీసుకువెళ్లి విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

- చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజే మొదలైన ప్రజల ఇక్కట్లు
- ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని ప్రజల పాట్లు
- టంగుటూరు టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

టంగుటూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజే ప్రజలకు ఇక్కట్లు మొదలయ్యాయి. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పోలీసులు ఇతర వాహనాలు, లారీలను, కాలేజీ బస్సులను నిలిపేసి కేవలం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి పోతున్న కార్లు, బస్సులను వదలటంతో ఏడు, ఎనిమిది కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రజలు, కూలి పనులకు పోయే పేదలు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ జామ్ అవ్వటంతో లారీ డ్రైవర్లు మంచి నీరు, అల్పాహారం లేక కడుపు మాడ్చుకున్నారు. ప్రమాణ స్వీకారానికే ఇలా ఇబ్బందులు పెట్టారు, ఇక ఐదేళ్ల పాలన ఊహించుకుంటే భయమేస్తుందని ప్రజలు అంటున్నారు.



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద నుంచి కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



త్రోవగుంట వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్



గుంటూరు, విజయవాడ వైపు వెళ్లకుండా త్రోవగుంట వద్ద వాహనాలను ఆపుతున్న పోలీసులు

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రులు గన్నవరం సమీపంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా జిల్లా వైపు నుంచి జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. విజయవాడ, వైజాగ్, రాజమండ్రి వెళ్లే వాహనాలను వయా చీరాల, బాపట్ల మీదుగా వెళ్లేలా త్రోవగుంట వద్ద ట్రాఫిక్ మళ్లించారు.

- ఒంగోలు





త్రోవగుంట నుంచి చీరాల వైపు వెళ్తున్న వాహనాలు



పోలీస్ ఆంక్షలతో బోసిపోతున్న ఒంగోలు-విజయవాడ రహదారి

పొగాకు ధర గరిష్టంగా రూ.331

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్ ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో బుధవారం 9931 బేళ్లు రాగా, 8864 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని, 1067 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 79వ రోజు వేలంలో 4752 బేళ్లు రాగా, 4321 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 431 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.331 కాగా, కనిష్టంగా రూ.205, సరాసరి ధర రూ.283.34 వచ్చింది. మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 74వ రోజు వేలం పాటలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 5179 బేళ్లు రాగా, 4543 బేళ్లు కొనుగోలయ్యాయని, 636 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. అందులో గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.281.08 పడినట్లు చెప్పారు.

మంత్రిగా స్వామి



సింగరాయకొండ: రాష్ట్ర కేబినెట్ మంత్రిగా కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. వరుసగా మూడు సార్లు కొండపి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన స్వామి టీడీపీ విధేయుడిగా మంత్రి పదవి దక్కించుకున్నారు.

నూతన కళాశాలకు అడ్మిషన్లు

కొత్తపట్నం: మండలంలోని కొత్తపట్నం గ్రామంలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, ఈ విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభమవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి తెలిపారు. బుధవారం హైస్కూల్‌లో విద్యా కమిటీ చైర్మన్ అయిల సుబ్బారావు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ఉంటాయని ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉంటాయన్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా ఉపాధ్యాయులతో క్యాంపెయిన్ చేపడుతున్నట్లు చెప్పారు. రెండు గ్రూపుల్లో 32 మంది విద్యార్థులు చేరారని, త్వరలోనే సీట్లు నిండిపోతాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను దూర ప్రాంతాల్లో కాకుండా మనకు దగ్గరలో ఉన్న కొత్తపట్నంలో హైస్కూల్ లో ఎంపీసీ, సీఈసీ, కేజీబీవీలో బైపీసీ గ్రూపుల్లో చేర్చాలని సూచించారు. రెండు గ్రూపులు ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాధక్క విప్లవ స్ఫూర్తిని కొనసాగిద్దాం




రాధక్కకు నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

ఒంగోలు టౌన్: మార్క్సిజం, లెనినిజం వెలుగులో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన రాధక్క విప్లవ స్ఫూర్తిని కొనసాగించాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మృతి చెందిన సీపీఐ ఎంఎల్ ప్రతిఘటన ఉద్యమ నాయకురాలు అక్కినేని నిర్మల అలియాస్ రాధక్క సంతాప సభ బుధవారం నగరంలోని 'మంచి పుస్తకం' వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రాధక్క చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం వహించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకురాలిగా అనతికాలంలోనే కేంద్ర నాయకత్వానికి ఎదిగారని చెప్పారు. రాధక్క కాకినాడలో పాలిటెక్నిక్ చదువుకున్నారని సీపీఐ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు తెలిపారు. పీడిత తాడిత ప్రజలకు ఆమె అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొంగర నరసింహ, కార్మిక నాయకులు సామేలు, సమతా దళ్ ఫోర్స్ నాయకులు పాలడుగు రమేష్, ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షులు గాలి సంగీతరావు, విశ్రాంత సబ్ కలెక్టర్ పి.పేరయ్య, ఆవుల సుబ్రహ్మణ్యం, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ధరణి కోట లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు.

మార్కాపురం/బేస్తవారిపేట: వెలుగునిచ్చే కరెంటు అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలు తీస్తుంది.. మరికొన్ని జీవితాలను అంధకారం చేస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా విద్యుత్ తీగలు యమపాశాలుగా మారే ప్రమాదం ఉంది. మనిషి జీవనయానంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న విద్యుత్‌ను సక్రమంగా వినియోగించుకోవడంపై అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

- వర్షాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ముప్పు
- పశ్చిమ ప్రకాశంలో ఆరు నెలల్లో ఆరుగురు మృతి
- పదుల సంఖ్యలో గేదెలు మృత్యువాత
- చిన్నపాటి జాగ్రత్త చర్యలతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట
- తీగలు, స్టార్టర్ మరమ్మతులకు సొంత ప్రయత్నాలు తగదు

యమపాశాలు!





నేలకు దగ్గరగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్టార్టర్

ప్రమాదాలు ఇలా..

వర్షకాలంలో ఈదురుగాలులతో విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంట్ సరఫరా అవుతుండటంతో పశువులు, ప్రజలు షాక్‌తో మృతి చెందుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేకపోవడంతో ఏమరపాటుతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే సందర్భంలో కరెంట్ సరఫరా కావడంతో పలువురు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. వర్షాలు కురుస్తుండటంతో పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు పంటలకు నీరు పెట్టడానికి వెళ్లి పొరపాటున విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, కిందకు వేలాడుతున్న తీగల వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో బోర్ల కింద పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉండటంతో రైతులు, పొలాల్లోకి జీవాలను మేత కోసం తోలుకెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

6 నెలల్లో ఆరుగురు మృతి

పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకూ ఉన్న 14 మండలాల్లో పలువురు రైతులు, కూలీలు, విద్యుత్ సిబ్బంది 6 నెలల వ్యవధిలో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

- జనవరి 9న రాచర్ల మండలంలోని పలుగుంటిపల్లెలో బోరు మోటారు కేబుల్ తగిలి వృద్ధుడు చనిపోయాడు.
- ఫిబ్రవరి 12న రాచర్ల మండలం అక్కపల్లి గ్రామంలో మొక్కజొన్న కోసేందుకు వెళ్లిన మహిళా కూలీ యోగమ్మ తీగలు తగిలి విగతజీవిగా మారింది.
- ఫిబ్రవరి 23న కంభం మండలం యర్రబాలెం గ్రామంలో విద్యుత్‌లైన్ లాగుతుండగా కరెంటు షాకుకు గురై వెంకటేశ్వర్లు మృతి.
- ఏప్రిల్ 3న కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంలో ఇంట్లో మోటారు వేస్తూ విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు.
- ఈనెల 10వ తేదీన గిద్దలూరు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద విద్యుత్ తీగలు వాహనానికి తగిలి అన్నాదమ్ముళ్లు శీలం లోహిత్ కృష్ణ, సాయికృష్ణ మృతి చెందారు.
- పాదిలి, కొనకనమిట్ల, కొమరోలు తదితర మండలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి పదుల సంఖ్యలో గేదెలు మృత్యువాతపడ్డాయి.



గిద్దలూరులో మూడు రోజుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన అన్నదమ్ములు



విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

అప్రమత్తత ముఖ్యం

ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్‌శాఖ అధికారులు చెప్పే జాగ్రత్తలు పాటించాలి. తీగలు తెగిపడినట్లు గుర్తిస్తే వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

– సన్యాసిరావు, విద్యుత్ శాఖ ఏఈ, బేస్తవారిపేట



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన మహిళా కూలీ యోగమ్మ (ఫైల్)

మూడింటికే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. గాయాలపాలైతే పరిహారం ఉండదు. ప్రమాదం జరిగిన స్థలంలోనే తీసిన ఫొటో, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్‌శాఖ అధికారులకు అందిస్తే పరిహారం మంజూరు చేస్తారు.

నష్టపరిహారం ఇలా..

- ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి పడినప్పుడు వాటికి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్ట పరిహారం చెల్లిస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటిని తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్ట పరిహారం ఇస్తారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి



- ఇంట్లో నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు, ఐఎస్ఐ మార్క్ ఉన్న పరికరాలు, విద్యుత్ తీగలు మాత్రమే వాడాలి.
- వర్షం పడే సమయంలో తడికాళ్లు, తడి చేతులతో తీగలు, స్విచ్‌లను ముట్టుకోవద్దు.
- పిడుగులు పడేటపుడు, గాలీవాన సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో, విద్యుత్ తీగల కింద ఉండకుండా జాగ్రత్త వహించాలి.
- పొలాల్లో మోటారు వేసేప్పుడు రైతులు రబ్బరు చెప్పులు, గ్లౌజులు వేసుకోవాలి.
- విద్యుత్ వైర్లు పొలాల్లో లేకుండా చూసుకుంటే మంచిది.
- పొలంగట్ల వెంట విద్యుత్ వైర్లు ఉంటే రాత్రి సమయంలో పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో ఇంట్లో ఫ్రిజ్, హీటర్, టీవీ, గీజర్ స్విచ్ ఆన్ చేయాల్సి వస్తే బోర్డులపైనా తేమ లేకుండా చూసుకోవాలి.
- వర్షం కురిసే సమయంలో, వర్షం పడిన తర్వాత రహదారుల వెంట ఉండే విద్యుత్ స్తంభాలను తాకరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంట్ ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- మోటార్లను నేలపై కాకుండా దిమ్మెలపై ఏర్పాటు చేయాలి, స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతగా ప్రయత్నించకూడదు.
- స్టార్టర్ వైర్లు నేల మీద ఉంచకూడదు. స్టార్టర్‌పై మూత తీసి వాడకూడదు.
- సర్వీసు వైర్లు, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి వాడాలి. అతుకులు లేకుండా చూసుకోవాలి.
- సబ్‌మెర్సిబుల్ మోటారు వైర్లు కొద్దిమాత్రం తెగినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో షంషేర్ అలీబేగ్, పీఎల్‌పీ యాదవ్

వైఎస్ జగన్‌ను కలిసిన షంషేర్, పీఎల్‌పీ

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏఎంసీ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మార్కాపురం ఏఎంసీ మాజీ డైరెక్టర్, బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం నియోజకవర్గంలో ఎన్నికలు, తదనంతర పరిస్థితులను వివరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ఇరువురు నేతలు పేర్కొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

- టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: పొగాకు రైతులు పచ్చిరొట్ట పైర్లను విరివిగా పెంచి భూసారం పెంపొందించుకోవాలని టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. రైతులకు పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతను వివరించి ఎక్కువ మొత్తంలో సాగయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. నేల భౌతిక లక్షణాలు పెంపొందించడం, నత్రజని, ఇతర పోషకాలు లోపలి పొరలకు ప్రవేశించడం, కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించేందుకు పచ్చిరొట్ట పైర్లు ఉపయోగపడతాయని చెప్పారు. ఎకరానికి 15 నుంచి 20 కేజీల విత్తనాలు చల్లి 50 నుంచి 55 రోజుల తర్వాత అంటే పూత దశకు రాక ముందే పంటను నేలలో కలియదున్నితే భూసారం పెరిగి తర్వాత సాగు చేసే పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. అలాగే భూమికి నీటిని నిల్వచేసే సామర్థం పెరుగుతుందని, రసాయనిక ఎరువులు వేసే పరిమాణం కూడ తగ్గుతుందని చెప్పారు. సేంద్రియ కర్బన శాతం కూడా పెరుగుతుందన్నారు. విరివిగా పచ్చి రొట్ట పైర్లు వేసి నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. రైతు సంఘ నాయకులు, ఐటీసీ, జీపీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన బైక్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అబ్దుల్ రెహమాన్



పంట కాల్వలో బాజీబాబు మృతదేహం

- అక్కడికక్కడే యువకుడు మృతి

మార్కాపురం టౌన్: పంట కాల్వలోకి బైక్ దూసుకెళ్లడంతో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని బోడపాడు రోడ్డులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తర్లుపాడు మండలం బుద్ధపల్లి గ్రామానికి చెందిన బత్తుల బాజీబాబు(25) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకున్న అనంతరం యథావిధిగా తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి బోడపాడు వద్ద ఉన్న పంట కాల్వలో పడి పోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల కార్మికత్వాన్ని అంతం చేద్దాం

- ఈ నెల 30 వరకు బాలకార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్
- పోస్టర్ ఆవిష్కరణలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్, ఐసీడీఎస్ పీడీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ మాధురి, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ రామాంజనేయులు

ఒంగోలు సిటీ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత అని, ప్రకాశం జిల్లాను బాలకార్మికులు లేనిదిగా రూపొందించాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వి.రామాంజనేయులు, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'బాల కార్మికత్వాన్ని అంతం చేద్దాం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మికులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ పెను సవాలుగా మారిందని, బాలల భద్రతకు ముప్పు కలుగుతోందన్నారు. బాలలు జీవించే హక్కును కాపాడాలని చెప్పారు. బాలలను పనిలో పెట్టుకునేవారికి జైలు శిక్ష, జరిమానా తప్పవని హెచ్చరించారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జూన్ 30 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో బాల కార్మికులను గుర్తిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా 18001027222కు ఫోన్ చేసి సమాచారం చెప్పవలసిన బాధ్యత సమాజంలో పౌరులందరి మీద ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ పి.దినేష్‌కుమార్, శిశుసంక్షేమ శాఖ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శైలజ, బాలల సంరక్షణ అధికారి కె.శేఖర్‌బాబు, ఎల్‌సీపీఓ బి.ప్రభాకర్, చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ జీవిత, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు పరిశ్రమ తనిఖీ



ఫెస్ట్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో సదరన్ ఫెస్ట్ పురుగు మందు తయారీ కంపెనీని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.శ్రీనివారావు బుధవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక తనిఖీల్లో భాగంగా పురుగు మందుల తయారీ ఫ్యాక్టరీని సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. కల్తీ లేకుండా నాణ్యమైన పురుగు మందులు తయారు చేయాలని యాజమాన్యానికి సూచించారు. కంపెనీ ద్వారా ఎవరెవరికి మందులు సరఫరా చేస్తున్నారో తెలుసుకున్నారు. రికార్డులతోపాటు మందుల నిల్వలను తనిఖీ చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. జేడీఏ వెంట టెక్నికల్ ఏఓ రమేష్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రమేష్ పాల్గొన్నారు.

పరారీలో మద్యం దుకాణం సేల్స్‌మన్

- రూ.6.08 లక్షలతో ఉడాయించినట్లు పోలీసులకు ఫిర్యాదు

పామూరు: ప్రభుత్వ మద్యం దుకాణంలోని నగదుతో సేల్స్‌మన్ ఉడాయించిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. మండల కేంద్రమైన పామూరులో నెల్లూరు రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ సమీపంలో 8297 నంబర్ మద్యం దుకాణంలో మోపాడు గ్రామానికి చెందిన షేక్ నాయబ్‌రసూల్ సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 9, 10వ తేదీల్లో మద్యం విక్రయించగా వచ్చిన నగదు 6,08,190 రూపాయలను బ్యాంకులో ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా పరారయ్యాడు. దీనిపై మార్కాపురం డిపో ఎక్సైజ్ ఎస్సై పద్మజ పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.

బాలుడు బలవన్మరణం



శ్రీకాంత్ మృతదేహం

ఒంగోలు టౌన్: పదిహేనేళ్ల బాలుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం ఒంగోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని నెహ్రూ నగర్‌లో నివాసం ఉండే దార్ల వెంకటేశ్వర్లు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు శ్రీకాంత్ (15) ను చిన్నప్పుడు పెంపకానికి ఇచ్చారు. ఆ తరవాత తిరిగి తెచ్చుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి షెడ్డుకు ఉన్న ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.